# నైట్‌బెల్

## కొండపల్లి కోటిలింగం



నైట్‌డ్యూటీ సిస్టరు నిద్రపోతున్న మెడికల్ స్టూడెంట్ ఆనంద్‌ను పిలిచింది. తన జీవితం గురించి ఆలోచిస్తూ నిద్రించిన ఆనందరావు కల కాస్త కరిగిపోయింది. తనను "డాక్టర్" అని సంబోధిస్తున్న సిస్టర్‌మీద చాలా కోపం వచ్చింది. కాని, తాను ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండటం వలన మౌనంగా ఉండి, "సిస్టర్" అని పిలిచాడు, వస్తున్న దగ్గు—తెరను ఆపుకుంటూ. "ఏమిటి డాక్టర్" అంటూ వెంటనే దగ్గరకు వచ్చింది సిస్టర్.

"ఒక మాట చెప్తాను; కోపగించుకోకుండా వింటావా ?" నవ్వుతూ అన్నాడు.

"నాకు కోపం అసలు రాదు! డాక్టరుగారూ !" అంది.

ఆ డాక్టరు అనే పదం తన హృదయాన్ని పెల్చి వేస్తోంది.

"నిజంగా కోపగించుకోకూడదు" అన్నాడు ఆనంద్.

"చెప్పండి డాక్టర్!" అంది ఇంజక్షన్ పొడుస్తూ.

"అబ్బ! సిస్టర్! నీకు తెలుసు బాగా; నా కేమి జబ్బో. ఈ వ్యాధి యింత ముదిరిన పిదప ఇంత వరకు ఎవరూ బ్రతుకలేదు. ముందు బ్రతుకరని కూడ తెలుసు. నన్ను యికముందు 'డాక్టర్' అని సంబోధించకండి సిస్టర్! ఆ మాట విన్నప్పుడల్లా, నా మనసు చాలా బాధపడుతుంది. ఆ పదం కోసం చాలా దూరం నుంచి యిక్కడికి వచ్చాను. కాని ఆ చదువు పూర్తి కాకుండానే ఈ లోకాన్ని.."

"ఆపు; డాక్టర్!"

"ఇదుగో, మళ్ళీ మొదలుపెట్టావు. దయచేసి నన్ను అలా పిలువకు సిస్టర్.

"సరే, ఆనంద్! ఇక అలా పిలువను మిమ్మల్ని. కాని ఒక సందేహం. మీరు ఎందుకు ఇంత నిరాశ పడిపోతున్నారు? ఈ వ్యాధి ఎందుకు నయం కాకూడదు. నిరాశ చెందకండి ఆనంద్! ఆ! అన్నట్లు మరచాను. సాయంత్రం సుందర్ వచ్చి ఈ ఉత్తరం మీకు యివ్వమని యిచ్చి వెళ్ళాడు. నేను మళ్ళీ 8 గం. కు వస్తాను. భోజనం తీసుకొని వస్తాను."

ప్రియమైన తమ్ముడికి, గుంటూరు.

ఇక్కడ అంతా క్షేమం. నీ దగ్గరనుంచి ఉత్తరాలు లేవు. కనీసం డబ్బుకు కూడ ఉత్తరం వ్రాయడంలేదు. మాకు చాలా ఆదుర్దాగా ఉంది. ఈమధ్య మామయ్య వచ్చాడు యిక్కడికి. కమల ఇంటర్ ప్యాసయిన సంగతి నీకు తెలుసు ననుకుంటాను. నీకోసం కమలను కూడ డిగ్రీ కోర్సులో చేర్పించాడు మామయ్య. పెళ్ళికి తొందర పెడుతున్నాడు. నీకు యిక ఒక సంవత్సరమే కదా చదువు. ఈ మాఘ మాసంలో మంచి లగ్నాలున్నాయి. మీ వదిన కూడా ఈ సంగతి వ్రాయమంది. కనుక నీవు ఏ సంగతి వెంటనే ఉత్తరం రాయి. దీనితో అయిదు వందలు రూపాయలు పంపుతున్నాను. నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ ఉంటాము. కమల బాగానే చదువుతోంది. పాప 'నీవు ఎప్పుడు వస్తావు' అని, "కీ" కారు ఎప్పుడు తెస్తాడు అని అడుగుతోంది. ఇంతే సంగతులు.

ఇట్లు,
నీ ప్రియమైన అన్నయ్య,
కామేశం.

ఉత్తరం చదివి బల్లమీద పడేశాడు. గాలికి అది అలా పైకి క్రిందికి ఎగురుతూ ఉంది. దానిని దిండుక్రింద పెడదామని లేచాడు కాని, పెద్దగాలికి ఆ ఉత్తరం బయటకుపోయింది. దానిని తీసుకోవడానికి లేచాడు. కాని యింతలోనే సిస్టర్ అటు నుంచి ఉత్తరం తీసుకొనివచ్చి యిచ్చింది. "థాంక్స్" అన్నాడు.

"పరవాలేదు ! ఆనంద్!"

"అరే! మీకు తెలుగుకూడా వచ్చునా ?"

"అదే నేను అడుగుదామనుకుంటున్నాను. ఆనంద్!"

45-వ పేజీ చూడండి



బొంబాయి ఆంధ్ర మహాసభ పోటీలో మూడవ బహుమతి పొందిన కథ

# విధిబలి

12 వ పేజీతరువాయి

"భలే తమాషాగా ఉందికదూ ! సిస్టర్ !" అన్నాడు ఆనంద్ లేని నవ్వు తెచ్చుకుంటూ:

"సిస్టర్ ! మీకు తెలుగు వ్రాయడం, చదవడం వచ్చునా ?"

"ఎందుకు రాదు? నేను తెలుగుదేశంలో పుట్టిన దాన్నే."

"ఒక సహాయం చేసిపెడ్తావు, సిస్టర్!"

"ఓ, తప్పకుండా !"

"నాకు ఒక ఉత్తరం రాసిపెట్టాలి." అన్నాడు.

"ఓస్, అంతేగా. తప్పక వ్రాసిపెడ్తాను; ఒక గంట ఆగి" అంది.

"థాంక్స్."

ఉత్తరం ఏమి వ్రాయాలో ఆలోచిస్తూ, మళ్ళీ మళ్ళీ అన్నయ్య వ్రాసిన ఉత్తరాన్ని చదువుతున్నాడు. కమల సంగతి ఏమిటి? పెళ్ళిచేసుకుంటానని వాగ్దానం చేశాడు. తనకోసం పల్లె విడిచి పట్నంలో చదువు చెప్పిస్తున్నాడు మామయ్య. కాని తన జీవితం కొద్ది కాలంలో ముగియబోతున్నది. కనీసం అన్నయ్యను, వదినను చూడడానికికూడ నోచుకోలేకపోయాడు. ఇంటికి పోతాను అంటే, డాక్టరు: 'వాళ్ల జీవితంకూడ రోగపూరితం చేయదల్చుకున్నావా ?' అన్నాడు. అందుచేతనే తన జబ్బు సంగతి ఎవ్వరికీ తెలియనివ్వలేదు. ఈ సంగతి తెలిస్తే వారు రెక్కలు కట్టుకొని వాలుతారు. కాని, వాళ్లకంత శ్రమ నివ్వడం తన కిష్టంలేదు. పాపకు "కీ" కారు తెస్తానని చాలాసార్లు చెప్పాడు. పాపకు "కీ" కారు తప్పక పంపాలి. పాపం! కమల గతేమిటి ? తన జీవితం అంతం కాకముందే కమలను ఒక యింటిదాన్ని చేయాలి. అప్పుడు గాని, తన ఆత్మకి శాంతి కలగదు. ఇక అన్నయ్యకు......

"హల్లో! ఆనంద్! ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది; అప్పుడే భోజనం తీసుకొని వస్తున్న సిస్టర్.

ఆనంద్ మాట్లాడలేదు.

"భోజనం చేయండి" అంది.

"ఆకలిగా లేదు సిస్టర్."

"అదేమిటి ఆనంద్ ! ఉదయంకూడా సరిగ్గా భోజనం చేయలేదుట. డాక్టరు చదువుతున్న మీరు అలా చేస్తే ఎలా ?"

"కాదు సిస్టర్! నిజంగా ఆకలిగా లేదు. మరి ఉత్తరం వ్రాసిపెడ్తావా?" స్కూలు—పిల్లవాడు లెక్కలు చేసిపెట్టమన్నట్టుగా అడిగాడు.

"ముందు అన్నం తింటే గాని వ్రాయను" అంది. విధిలేక యింత ఎంగిలి చేశాడు. సిస్టరు కాగితం కలం తీసుకొని ఉత్తరం మొదలుపెట్టింది.

బొంబాయి.

ప్రియమైన అన్నయ్యగారికి,

మీరు వ్రాసిన ఉత్తరం, డబ్బు అందినవి. నేను కులాసాగానే ఉన్నాను. కాలేజీవలన తీరిక లేక ఉత్తరం వ్రాయలేకపోయాను. పాపకు 'కీ' కారు తొందరలోనే పంపుతాను. పాప బాగా చదువుతోంది తలుస్తాను. వదిన కులాసాగా ఉందా ?

అన్నయ్యా ! నాకు నా పెళ్లివిషయంలో స్వతంత్రం ఉందికదా ? నీవు ఏమి 'బాధ' పడకుండా ఉంటే ఒక సంగతి చెప్తాను. మరి నన్ను క్షమించాలి. నేను కమలను పెళ్లిచేసుకోను. ఈ సంగతి మామ


ఆయుధాల కొరకు
ఆభరణాలను ఇవ్వండి

RATNAM'S N-OIL
(పై పూతకు మాత్రమే)
అంగ నరములు బలహీనత చెంది, చిన్నదైనచో తిరిగి యధాప్రకారం అయి పూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం॥ ప్రఖ్యాతి గలది. 1 సీసా రూ. 10/–లు. వి.పి. 1-4-0. కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్జంటు గుణమునకు రూ. 25-0-0 లు.
డాక్టర్ రత్నం సన్స్. (Estd 1904)
మలకపేట బిల్డింగ్స్, ఆజంపూరా మార్కెట్ వద్ద,
హైదరాబాద్ 24 (ఆంధ్రప్రదేశ్)

శ్రీ దేవి కల్పం
30 సం. అనుభవం. దురదలు, పొక్కులు, మంట, పగుళ్లు, నల్లరంగు పొడలు, గజచర్మం, తిమ్మిర్లు, దద్దులు, పొడిచినప్పుడు నొప్పిలేకుండుట, ఎఱ్ఱ పొడలు, తెల్లపొడలు, గ్రంధి, గుంటవుండ్లు, మొదలగుమహావ్యాధులకు నివారిణి. 40 రోజులు కల్పం రు. 15/– V. P. ఖర్చు ప్రత్యేకం.
డా॥ K.A. గోవిందస్వామి, R.M.P.
67, పేరంబాలు శెట్టి వీధి, మద్రాసు-21.

బర్క్లీ




కమ్మని రుచి
ధారాళమైన పొగ

✡ ప్రతి బర్క్లీ సిగిరెట్టు పెట్టెమీదవున్న నక్షత్రం మార్కు.
ఇది ప్రఖ్యాతమైన డబ్ల్యు. డి. & హెచ్. ఓ. విల్స్ నాణ్యత కలిగివున్న సరుకునకి గ్యారంటీ.

# వి ధి బ లి

య్యకు దయచేసి చెప్పు. ఇక ఆ విషయంగూర్చి నన్ను బాధపెట్ట కన్నయ్యా! ఇంతే సంగతులు.

ఇట్లు నీ ప్రియమైన తమ్ముడు,
ఆనంద్.

ఉత్తరం వ్రాయడం ముగిసింది. సిస్టరు కన్నీరు తుడుచుకుంటూ "యిదిగో, ఆనంద్‌గారూ! ఉత్తరం"అంటూ అందించింది. ఆమె కన్నీటి బిందువులు అతనికి తగలగానే ఆనంద్ ఈ లోకానికి వచ్చాడు. సిస్టరుతో ఏమీ మాట్లాడలేకపోయాడు. సిస్టర్ బెడ్‌లైట్‌వేసి వెళ్లిపోయింది.

* * *

అర్ధరాత్రివేళ ఆనందుకు విపరీతమయిన దగ్గుపోటువల్ల చాలా రక్తము పోవడంతో, డాక్టర్లు అంతా ఆశలు విడిచారు. ఆనందు—ఇంటికి కబురు పంపాలని నిశ్చయించారు. కాని ఎవరికీ అడ్రసు తెలియకపోవడంవలన దేవుడిమీద భారంవేసి తమ కర్తవ్య ప్రకారం చికిత్స చేయసాగారు.

దేవుడి దయవల్లనయితేనేమి, డాక్టర్ల కృషివల్ల నయితేనేమి, ఆనందు కా దినంగడిచింది. నైట్, డ్యూటి సిస్టరు యింటికి వెళుతూ ఆనంద్ వద్దకు వచ్చింది. ఆనందు నవ్వుతూ :

"ఎందుకు మీరంతా యింత కష్టపడతారు. నన్ను తొందరగా పంపడం యిష్టంలేదా ?" అన్నాడు.

"అదేమిటి ఆనంద్ ! అలా అంటారు. దయచేసి నన్ను బాధపెట్టి మీరు బాధపడకండి." అన్నది.

"పిచ్చిపిల్ల" అని మనసులో అనుకొని తల వాల్చాడు.

* * *

"గుడ్ మార్నింగ్! ఆనంద్" అంటూ వచ్చాడు సుందర్.

"వెరీ గుడ్‌మార్నింగ్. వెరీగ్లాడ్ టు సీ యు" అన్నాడు ఆనంద్.

"ఆనంద్! అంతా డాక్టర్ చెప్పారు. ఇప్పటి కయినా నా మాట విని ఇంటికి ఒక ఉత్తరం రాయి. అయినవాళ్లు దగ్గర ఉంటే, రోగం తొందరగా నయమవుతుంది."

"పిచ్చివాడా ! యీ పరిస్థితిలో నా వాళ్లను పిలిపించి, వాళ్లనుకూడ బలిపీఠానికి ఆహ్వానించమంటావా ? సుందర్! నన్ను అలా ఆ తోటలోనికి తీసుకొనిపోతావా ? నీతో కొద్దిగా మాట్లాడాలి." అన్నాడు.

"ఈ మంచులో తోటలోనికి ఎందుకు? యిక్కడ మాట్లాడకూడదా ?" అన్నాడు సుందర్ పుస్తకం బెంచీమీద పెడుతూ.

"కాదు సుందర్ ! ఒక్కరోజయినా మామూలు వాతావరణం నన్ను అనుభవించనీవా" ? అన్నాడు.

"సరే; నీ ఇష్టం. పద" అంటూ ఆనందుని తోటలోనికి తీసికొనిపోయాడు.

"సుందరం ! ఈ ఉత్తరం చదువుతావూ" అంటూ ఆనంద్, అన్నయ్య వ్రాసిన ఉత్తరం ఇచ్చి "ఒక సిగరెట్ దానం చేయగలవా, సుందర్" అంటూ జాలిగా అడిగాడు.

ముందు ఇవ్వాలని లేకపోయినా, ఎందుకో ఒక సిగరెట్—ప్యాకెట్ ఇచ్చాడు. సిగరెట్ అనుభూతి పొందుతూ; ఆనందిస్తున్నాడు ఆనంద్. సుందరం ఉత్తరం చదివి ఆనందుకు యిచ్చాడు. కొద్దికాలం ఇద్దరూ మౌనంగా ఉన్నారు. ఇంతలోనే ఆనంద్ అన్నయ్యకు వ్రాసిన ఉత్తరం ఇచ్చాడు చదవమని. సుందరం ఆ ఉత్తరంకూడా చదివి కన్నీరు విడిచాడు. "విచారిస్తున్నావా సుందరం?" వెంటనే ప్రశ్నించాడు మరొక సిగరెట్ వెలిగిస్తూ.

"అదికాదు ఆనంద్ ! నీవు నాకు చేసిన సహాయం ఏ జన్మలోను మరచిపోలేను. దిక్కులేని వాణ్ణి ఆదరించావు. నీతోబాటు నాకుకూడా విద్య నేర్పించావు. నీకు నేను ఏ సహాయం చేయగలను ఆనంద్! నీవులేని బ్రతుకెందుకు?"

"ఏమిటి నీ మాటలు. ఒకరిని చంపగల శక్తి మానవుడిలో ఉంది గాని, బ్రతికించగల శక్తి మానవుడికి యింకా రాలేదు. ఎందుకు విచారిస్తావు. విధిరాతను తప్పించలేము. అన్నట్టు మరచాను. నైట్ డ్యూటీ సిస్టరు తెలుగుది; తెల్సా" సంభాషణ మారుస్తూ అన్నాడు ఆనంద్.

ఆ మాటలు వినిపించలేదు సుందరానికి. మళ్లీ సిస్టరు—సంగతి చెప్పాడు.

"సుందరం ! సిస్టరు చాలా మంచిది. నిజంగా వాళ్ళు చేసే సేవ అతీతం. ఎంత రోగంతో బాధపడుతున్నా, తమ స్వంతవారిని చూసినట్లు కాపాడుతారు. వాళ్ల సేవాఫలం నిజంగా తీర్చలేము." అన్నాడు.

సుందరానికి ఈ సంభాషణమీద ఇష్టం లేదని గ్రహించాడు ఆనంద్.

"ఇదిగో సుందరం ! ఈ ఉత్తరంమీద మా ఇంటి అడ్రసు వ్రాసి, పోస్టుచేయి. అన్నట్లు నీ కాలేజి పైమయిందికదూ ! పరీక్షలు కూడా దగ్గరకు వచ్చాయి. బాగా చదువుతున్నావుకదూ !" బాగానే చదువుతున్నాననే అర్థంలో తల ఊపాడు సుందరం.

"మరి నేను సాయంత్రం వస్తాను. లోపలికి పోదాం పద" అని లోపలికి తీసుకొనిపోయాడు సుందరం.

ఆనంద్ ప్రక్కమీద నిద్రపోతున్నాడు. సిస్టరు వచ్చి ఆంధ్రపత్రిక అక్కడ ఉంటే, చదువుతూ కూర్చుంది. అకస్మాత్తుగా ఆనందరావు వంక చూసింది. అతనిమీద చాలా జాలివేసింది. ఇక కొద్దిరోజుల్లో ఈ లోకాన్ని విడిచి శాశ్వతంగా నిద్రపోబోవుచున్నాడు. ఎందుకో అతను "సిస్టర్" అని పిలిచినప్పుడల్లా నిజంగా అన్నయ్య పిలిచినట్లుగా ఉండేది. ఇంతవరకు చాలామందికి సేవ చేసింది కాని, ఎవ్వరిమీద యింత ప్రేమ కలుగలేదు. నిజంగా నాకు అన్నయ్య ఉంటే, ఎంత బాగుండేదనిపించింది. కాని ఆ అవకాశం తనకు లేకుండా పోయింది. ఇంతలోనే ఆనంద్ నిద్రనుంచి మేలుకొని "సిస్టర్" అన్నాడు గుండె పట్టుకొని.

"ఎందుకు ఆనంద్!" అంది మళ్లీ యీ లోకానికి వచ్చి.

"ఒకటి అడుగుతాను. చెప్తారుకదూ !" చిన్నగా అడిగాడు.

చిన్నగా నవ్వుతూ తలూపింది.

"నీ పేరేమిటి సిస్టర్!" అన్నాడు.

"అందరూ "సిస్టర్" అంటారు."

"అదికాదు సిస్టర్ ! నీకు అమ్మా, నాన్న పెట్టిన పేరు" మళ్లీ ప్రశ్నవేశాడు.

ఆ మాటలు వింటూనే ఎందుకో చెప్పరాని


హిందీ సులభంగా ఎలా నేర్చుకోవడం?

2 3 హిందీ స్వయంశిక్ష

తీరిక సమయాలలో యువతీయువకులు హిందీ ధారాళముగా మాటాడను, చదువను, వ్రాయను అత్యల్ప కాలంలో నేర్చుకొనుటకు సులభమైన పద్ధతిలో, తేలికైన భాషలో వివరించబడినది. వెల రు. 4-50 పోస్టు ఖర్చు 0-85.

వి. వి. జగన్నాథ్ కంపెని,
3, మునియప్ప మొదలివీధి, మద్రాసు-1.



నెలకు రు. 400 సంపాదించండి

డ్రాయింగ్ & పెయింటింగ్ గైడ్

ఫ్రీ హాండ్ డ్రాయింగ్, స్టెన్సిల్, కలర్ స్కీముతో పెయింటింగ్, ఇతర డ్రాయింగ్‌పనులు నేర్చుకోడానికి 400 బొమ్మలుగల పూర్తి గైడ్. దీని సహాయంతో మంచి డ్రాయింగ్‌మాస్టరు, పెయింటరు, డ్రాఫ్ట్స్‌మన్ డిజైనరు(ఆర్టిస్టు) కావచ్చును. ధర రు. 6/- ట్రాన్సిస్టర్ రేడియో గైడ్ : స్వంతంగా ట్రాన్సిస్టర్ రేడియో తయారించుటకు బొమ్మలగైడ్. ధర రు 4. ప్రతి పుస్తకమునకు పోస్టేజి రు 1 అదనం.

VANDANA BOOK DEPOT,
(APS) Rafatganj, ALIGARH





పెప్స్ గొంతు మరియు

గుండె జబ్బులను

మీరు సేవించేయడం

మీ దగ్గు త్వరితంగాపోవును



రొమ్ము పడిశెములు
గొంతు నొప్పి,
పడిశెము, అధిక
కఫము బలుబులు,
దగ్గులను
త్వరితంగా నివారించును

మందుల వ్యాపారులందరివద్ద అమ్మబడుచున్నవి

వి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి.

సోల్ ఏజంట్లు : దాదా & కంపెని,
86, నైనప్పనాయకన్ వీధి, మద్రాసు-3

దుఃఖంవచ్చింది. అది చూచి ఆనంద్ బాధపడ్డాడు.

"క్షమించు సిస్టర్ ! నీ మనసు చాలా బాధ పడిందనుకుంటాను." అన్నాడు.

"అదికాదు ఆనంద్ ! నా దొక విచిత్రమయిన జీవితం."

# విధిబలి

"నేను తెలుసుకోకూడదా సిస్టర్ ?" మళ్ళీ ప్రశ్న వేశాడు.

"మీకు అంత యిష్టమయితే తప్పక చెప్తాను.'

అంది.

"నాకు యిష్టము కానిదేది లేదు."

"సరే, చెప్తాను" అంటూ, ఆమె తన జీవిత కథను చెప్పనారంభించింది:

"ఆనంద్ ! నా తల్లిదండ్రులు లెవ్వరో ఎవ్వరికీ తెలియదు. నన్ను కన్నవారు ఒక అనాధ శరణాలయంలో పారవేసి పోయారు. నేను అక్కడే పెరిగాను. వాళ్ళే చదువు—సంధ్యలు చెప్పించారు. నేను నర్సింగ్ కోర్సులో ప్యాసయిన తరువాత యిక్కడికి వచ్చాను. అగ్రిమెంటు ప్రకారం యిక యిక్కడ పది రోజులు ఉంటాను. ఆ తరువాత వెళ్ళిపోదా మనుకుంటున్నాను. నాకు వాళ్ళు పెట్టిన పేరు "సరళ" అంటూ, తన కథను పూర్తి చేసింది.

ఆనందుకు తెలియకుండానే కన్నీరుతో చొక్కా తడిసిపోయింది.

"సరళా ! నాకు నీవు అంటే ఎంతో ప్రేమ. చెల్లాయి లేని లోటు తీర్చావు. మరి నీవు ఎక్కడికి వెళతావు?" అన్నాడు.

"అన్నయ్యా ! ఎక్కడికి అని చెప్పమంటావు. ఇక్కడనే ప్రయివేటు నర్సింగుహోమ్‌లో ఉద్యోగము చేయాలని ...."

"అవును సరళా ! నాకు అర్థమయింది." అంటూ సరళ ఉద్దేశ్యం కనుగొన్నాడు.

"మరి నన్ను విడిచిపోతావా యిక్కడనుంచి?" అని ముందు అన్నాడు కాని, వెంటనే "లేదు. నేనే నిన్ను విడిచిపోతాను" అన్నాడు. ఆ మాటలు సరళకు చాలా బాధ కలిగించాయి.

సాయంత్రం ఆనందును చూడటానికి వాళ్ళ క్లాసుమేట్లంతా వచ్చారు. అందరూ చాలా విచారించారు. అంతా ధైర్యంచెప్పి వెళ్ళిపోయారు. సుందర్‌మాత్రం ఆనంద్‌దగ్గర చాలాసేపు న్నాడు. సరళ—విషయం అంతా చెప్పాడు ఆనంద్. సుందర్ కూడ సరళ—జీవితం విని చాలా విచారించాడు.

*          *          *

"ఎక్కడనుంచండి ఉత్తరం" అంది లక్ష్మి తమలపాకులు అందిస్తూ భర్త కామేశానికి.

"ఆ వెధవ రాశాడు."

"ఎవరండీ ! ఎవరయినా పార్టీ రాశాడా ?" వెంటనే ప్రశ్నించింది.

"ఆరోజు సిగరెట్టు తాగితే, కొట్టబోతే అడ్డు వచ్చావు. ఈరోజు వీడు చేసిన పని చూడు" అంటూ బూట్లు వేసుకున్నాడు.

"ఎవరండీ ! ఆనంద్ సంగతా ! ఏమి జరిగింది ?'

"ఏమి జరుగుతుంది. కమలను పెళ్లి చేసుకోడట. మామయ్యకు నేను చెప్పాలట. వెధవకు బుద్ధి ఉండాలి." కోపం అంతా బూట్లమీద చూపాడు.

తమాషాకు వ్రాసిఉండవచ్చులెండి" అంటూ మరిదిని సమర్థించబోయింది.

"తమాషాకు కాదు; ఎవరో కులంలేని దానిని ప్రేమించి ఉంటాడు. పే.... ద్ద సంఘ సంస్కర్త కదూ !... అన్నట్టు మరచాను. ఈ సంగతి కమలకు చెప్పకు. పాపం! బాధపడుతుంది" అన్నాడు.

కాని, అప్పుడే కాలేజీకి బయలుదేరిన కమల లోపలనుంచి అంతా విన్నది.

*          *          *

"ఆనంద్ ! రాత్రి సుందర్ ఒక ఉత్తరం యిచ్చి వెళ్ళాడు. అప్పుడు నీవు నిద్రపోతున్నావు.


ఆయుధాల కొఱకు ఆభరణాలను ఇవ్వండి

జాతీయ రక్షణ నిధికి ఉదారముగా విరాళాలివ్వండి



చెవుడు

మా ఉత్తమ చికిత్సా విధానం మామూలు వినికిడిశక్తిని మరల చేకూర్చ గలదు. పరీక్షార్థ కోర్సు రూ. 17-97. పూర్తి కోర్సు రూ. 147-97.

Dr. Sherman, F.C.S (u.a.s.)
181, R. N. Guha Road,
Calcutta-28.



పౌడర్లలోకెల్ల మేలైనది




రాజా టాల్కం పౌడరు మంచి సువాసనగలది

మణ్యాం & కంపెనీ, బెంగుళూరు-20.

క్రింది చోట్ల యందు లభించును:

బెజవాడ వెంకన్న & సన్సు, రాజమండ్రి. * పువ్వాడ పుల్లయ్య & సన్సు, విజయవాడ. * రామా ఏజెన్సీస్, నెల్లూరు. * రవి & కంపెనీ, 53, బందరువీధి, మద్రాసు-1. * సిటీ ఎంపోరియం, మాణిక్యమందిర్, కాకినాడ.

ఇదిగో'' అంటూ యిచ్చి వెళ్లింది సరళ. ఆదుర్దాతో కవరు చింపాడు:

గుంటూరు.

బావకు,

ప్రథమ లేఖ ప్రేమలేఖ అనుకున్నా వనుకుంటాను. కాని యిది ప్రణయలేఖ కాకుండా హితలేఖ వ్రాస్తున్నాను. బావా! మనుష్యులు ఇంత తొందరగా ఎలా మారుతారో నాకు అర్థం కావడం లేదు. ఒకరికి ఆశ చూపి, పారిపోయినవారికి శిక్ష ఏమిటి? వాటిని మన కోర్టులు విచారించవు కదూ! వాటికి సాక్ష్యలు కావాలి కాని, దీనికి మనమే సాక్ష్యలు. ఒకసారి నీ మనసు నడుగు; నీవు చేస్తున్న పని మంచిదో, కాదో; అనవసరపు మాటలు ఎందుకు బావా! నీవు నన్ను పెళ్లి చేసుకోవని ఎందుకో నా మనసులో అనిపించింది. చాలాకాలం నుంచి నీ లేఖకు ఎదురు చూశాను. సిగ్గుచేత నీకు ఉత్తరం వ్రాయలేకపోయాను. ఆరు నెలల నుండీ కనీసం మీ అన్నయ్యకు కూడ ఉత్తరం రాయడంలేదు. అప్పుడే అనుకున్నాను. నీ కోసం నేను పట్నంలో చదువు మొదలుపెట్టాను. కనీసం నీవు ఆ ఉపకారం చేసినందుకు చాలా కృతజ్ఞురాల్ని బావా! నేను పల్లెటూరిలో ఉంటే, ఈ పరిస్థితిలో ఆత్మహత్య చేసుకొని ఉండేదాన్ని. కాని నేను యిప్పుడు కాస్త చదువుకున్నదాన్ని. అంత నీచమైన పని చేయలేను. అది కేవలం అవివేకం. కాని నాకు పెళ్లి కాదని భయంలేదు బావా! నేను ఎంత అబలనయినా నాకు పట్టుదల అనేది లేక పోలేదు. బావా! జరిగిపోయినదేదో జరిగిపోయింది. గతాన్ని మరచిపోదాం. కాని, మీ అన్నయ్య, వదిన చాలా బాధపడుతున్నారు. వారికి ధైర్యం చెప్పడం నా విధి కదూ! నీవు నాకు యిచ్చిన చుక్కల చీర, అదంటే నీకు చాలా ఇష్టం కదూ! కాని అది చిరిగిపోయింది బావా! దానితో నీకు ఒక చేతి—రుమాలు తయారు చేశాను. బహుమతిగా నీకు ప్రియమయినవారికి ఇవ్వు. మరి ఉంటాను. నీ లేఖకు ఎదురు......''

ఇట్లు,
కమల.

ఉత్తరం చూసి చాలా ఆశ్చర్యపోయాడు. కమల ఎందుకు ఇంత మారిపోయింది. బహుశా తన మీద పగ తీర్చుకోవడానికి చేసిన ప్రయోగం అనుకున్నాడు. అంతా మన మేలుకే అని సంతోషపడ్డాడు. కమల పెళ్లి చేసుకోవడమే తనకు కావలసింది. అప్పుడు కమల బాధ తనకు తీరిపోతుంది. ఇక తనకు ఏ విచారం లేదు. ఎందుకో యిప్పుడు తనకు చాలా ఉత్సాహంగా, సంతోషంగా ఉంది. "చెల్లాయ్" అంటూ గట్టిగా అరిచాడు. సరళ పరుగెత్తుకుంటూ వచ్చింది. "ఎందుకన్నాయ్" అంది. ఆ మాట వినగానే మరి సంతోషం వేసింది. "నే ననుకున్న పని అయిపోయింది. ఈరోజు ఎందుకో చెప్పలేని సంతోషంగా ఉంది. సరళా! కాగితం, పెన్ను యిస్తావూ? ఇంటికొక ఉత్తరం వ్రాయాలి" అన్నాడు.

"ఓ! తప్పకుండా!" అంటూ పెన్ను, కాగితం తెచ్చి యిచ్చింది; అతనిలోని ఆనందానికి అర్థం తెలియక.

బొంబాయి.

ప్రియమైన అన్నయ్యకు,

వారం రోజుల క్రితం మీకు ఉత్తరం వ్రాశాను. బహుశా ఆ ఉత్తరం మీకు బాధ కలిగించి ఉంటుంది. అంతకంటే నేను చేయగలిగిందేమీ లేదు. కమల నొక యింటిదాన్ని చేయాలనే ఉద్దేశ్యంతోనే అలా వ్రాశాను. ఈ ఉత్తరం నా జీవిత తుది ఘడియలలో వ్రాయుచున్నాను. క్షయ వ్యాధికి బలి—అయినందువలన, నేను అక్కడికి వచ్చి, మిమ్ములను బాధపెట్టడం యిష్టం లేనందుచే యిక్కడే అంతిమ స్థితికి వచ్చాను. యిక్కడి పరిస్థితులంతా తరువాత మీకు తెలియగలవు. పాపకు చాలా బొమ్మలు, "కీ" కారు కొన్నాను. వదిన బనారస్—చీరలు కావాలని చాలా కాలం నుంచి అనుకుంటూంది. అవీ, నీకు టెర్లిన్ ప్యాంటు, కమలకు చుక్కల చీర—అన్నీ నా గదిలో ఉన్నాయి; అన్నట్లు మరచాను. నేను పాతిక—వేల రూపాయలకు భీమా చేశాను. వాటికి సంబంధించిన కాగితాలు పెట్టెలో ఉన్నాయి. అన్నాయ్! నా తుది కోరిక. సరళ యిక్కడ నాకు సేవ చేసిన నిస్వార్థ; తెలుగుది. చెల్లెలు లేని లోటు తీర్చి, నిజమయిన అన్నయ్యలాగ చూసింది. చాలా మంచిది. నీవుకూడా సరళను చెల్లెలుగా చూస్తావుకదూ! ఇక పోతే, సుందరం సంగతి నీకు తెలుసు. వాణ్ణి మన బావగా చేసుకొని, సరళను, వాణ్ణి మన ఇంటిలోనే ఉంచుకోవలసింది. ఇది నా అంతిమ కోరిక. తప్పక తీరుస్తావు కదూ! వదినకు నా నమస్కారాలు. పాపకు నా ముద్దులు. కమలకు నా దీవెనలు.

ఇట్లు,
అభాగ్య తమ్ముడు,
ఆనంద్.

* * *

కారు అతివేగంతో పరుగెత్తుతోంది. ఆనంద్ ఎలా ఉన్నాడో అని అందరికీ భయంగా ఉంది. కామేశానికి తమ్ముడి గురించి ఆలోచన తప్ప కారు ఎలా పోతున్నదో కూడ చూడడంలేదు. ఆనంద్‌ను అత్తగారు తన పెంపగించిన వన్నివేశం కళ్ళలో మెదులుతూంది లక్ష్మికి. కమలకు తన బావనేగన కలిగిన కోపం అంతా పోయింది. బావను చూడాలనే ఆదుర్దా ఎక్కువయింది. పాప "కీ" కారు కోసం ఎదురు చూస్తోంది. చాలా దగ్గరకు వచ్చారు. "ఈ గ్రామం పేరు యిచ్చారండీ" అని అడిగింది లక్ష్మి.

"సుందర్ జబ్బుగా ఉందని ఇచ్చాడు" అన్నాడు కామేశం.

కారు హాస్పిటల్ చేరింది. కాని అంతా ముగిసిపోయింది. కాని అప్పటికే ఆనంద్‌ను అక్కడి నుంచి తీసుకొనిపోయారు. కారు అమిత వేగంతో స్మశానానికి బయలుదేరింది. "ఆనంద్" "ఆనంద్" అంటూ అంతా పరుగెత్తారు. కాని సుందరం వెలిగించిన అగ్గిపుల్లను కామేశం—చేతికి అందించాడు.




AGENTS FOR ANDHRA
ఆక్మి ట్రేడ్ ఏజెన్సీస్
విజయవాడ-1